| | |
|---|---|
| **Publication** | **Andhra Jyothi** |
| **Date** | **06.03.2019** |
| **Edition** | **Tamil Nadu** |
| **Page No** | **06** |

### స్టెరిలైట్ కర్మాగారం మూతతో

# తగ్గిన రాగి ఉత్పత్తుల తయారీ

చెన్నై, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడిలోని వివాదాస్పద స్టెరిలైట్ కర్మాగారం మూతపడడంతో 40 శాతం రాగి ఉత్పత్తుల తయారీ తగ్గిపోయిందని, విదేశాలకు ఎగుమతులు కూడా మందగించాయని మంగళవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఈఈపీసీ ఇండియా సీనియర్ వైస్ ఛైర్మన్ మహేష్ దేశాయ్ తెలిపారు. ఈఈపీసీ ఇండియా ఆధ్వర్యంలో మార్చి 14 నుంచి మూడు రోజులపాటు స్థానిక నందంబాక్కంలోని చెన్నై ట్రేడ్ సెంటర్‌లో ఇంటర్నేషనల్ ఇంజినీరింగ్ సోర్సింగ్ షో (ఐఈఎస్‌ఎస్) నిర్వహించనున్నారు. ఇంజినీరింగ్ నూతన ఆవిష్కరణలు, సాంకేతికతను తమిళనాడు ఇంజినీరింగ్ పరిశ్రమలకు పరిచయం చేసేందుకు ఈ ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్టు దేశాయ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న తమిళనాడు




విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న మహేష్ దేశాయ్

రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ విభాగం కార్యదర్శి ధర్మేంద్ర ప్రతాప్ యాదవ్ మాట్లాడుతూ.. భారతదేశంలో ఎంఎస్‌ఎంఈ రంగంలో ఎగుమతులకు చక్కని ప్రోత్సాహం లభిస్తోందని, ఇటువంటి ప్రదర్శనలు కొత్త సాంకేతికత గురించి అవగాహన పొందేందుకు ఎంఎస్‌ఎంఈలకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఆ సందర్భంగా తూత్తుకుడి ప్లాంట్ గురించి ప్రస్తావన రాగా, స్టెరిలైట్ మూతపడడం వల్ల రాగి ఉత్పత్తుల తయారీ, ఎగుమతులు తగ్గిన మాట వాస్తవమే అయినా, పర్యావరణం, స్థానిక పరిస్థితులను కూడా పరిగణలోకి తీసుకోవాల్సి వుంటుందని యాదవ్ బదులిచ్చారు. కాగా, ఇంజినీరింగ్ ఉత్పత్తుల ప్రదర్శనకు నగరవ్యాప్తంగా 40 ఇంజినీరింగ్ కళాశాలల నుంచి విద్యార్థులకు ఉచితప్రవేశం కల్పించినట్టు నిర్వాహకులు తెలిపారు.